
సాక్షి వనపర్తి

శుక్రవారం • 8 • నవంబర్ • 2024



.. చాంపియన్లుగా నిలవాలి

సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు తరలివెళ్లాయి.

వివరాలు 8లో ▸



అద్దెకు ఆర్టీసీ బస్సులు

శుభకార్యాలు, తీర్థయాత్రలకు అద్దెకు బస్సులు ఇచ్చేందుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది.

వివరాలు 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.5 /18.3

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. రాత్రివేళ చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

డీఐఈఓ తనిఖీ



వనపర్తి విద్యావిభాగం: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులకు ఆన్ జాబ్ ట్రైనింగ్ సెంటర్ వెన్నుముక వంటిదని డీఐఈఓ ఎర్ర అంజయ్య అన్నారు. గురువారం ఆయన జిల్లాకేంద్రంలోని ఓజేటీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని.. ఇందుకు కేంద్రాలు ఉపయుక్తంగా ఉంటాయని సూచించారు. 100 మార్కులకు ఓజేటీ నిర్వహిస్తామని.. విద్యార్థుల యాక్టివిటీ ఆధారంగా మార్కులిస్తామని వెల్లడించారు. విద్యార్థులు రోజు కేంద్రానికి వచ్చి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ



వైపీ రమేష్

వనపర్తి: జిల్లా పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ డీఎంగా వైపీ రమేష్ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఇర్ఫాన్‌ను గత నెల 30న నిజామాబాద్‌కు బదిలీ చేశారు. కార్పొరేషన్ ఎండీ బదిలీ ఉత్తర్వులు జారీ చేసినా.. ఉన్నతాధికారులను మచ్చిక చేసుకొని గురువారం జిల్లాలోనే తిష్టవేసిన ఆయనపై బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. గతంలో ఆయన పని చేసిన ప్రాంతాల్లో చేసిన అవినీతి చిట్టా, సస్పెండ్ అయిన ఉదంతాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు ఆయన్ను గురువారం మధ్యాహ్నం రిలీవ్ చేసినట్లు స్థానికంగా చర్చ వినిపిస్తోంది. దీంతో నిజామాబాద్ నుంచి జిల్లాకు వచ్చిన వైపీ రమేశ్ ఎట్టకేలకు బాధ్యతలు స్వీకరించారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

మదనాపురం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విజ్ఞాన దర్శిని రాష్ట్ర నాయకుడు ఆడం రాజు, ప్రజాకవి జనజ్వాల, గోపాలకృష్ణ, న్యాయ విద్యార్థి ప్రశాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాయలు, మంత్రాలంటూ స్వాములు, బాబాలు వివిధ వేషధారణలతో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. అలాంటి వారిని నమ్మొద్దని తెలిపారు. అనంతరం మంచినీటితో మంట మండించడం, ఒంటిపై కిరోసిన్ పోసుకొని మంటలు అంటించడం, చేతుల్లోని సున్నాన్ని ఎరుపుగా మార్చడం, కాగితాలు కాల్చి బూడిదగా మార్చి నోట్లు చేయడం తదితర ప్రదర్శనలు చేశారు. హెచ్‌ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదం.. పౌష్టికాహారం!

జిల్లాలోని అంగన్‌వాడీలకు నాసిరకం గుడ్లు పంపిణీ

- పలుమార్లు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు



జిల్లాకేంద్రంలోని పాత పట్టణంలో ఉన్న ఓ అంగన్‌వాడీలో ఉడకబెట్టిన నాసిరకం గుడ్లు



వనపర్తి: జిల్లాలోని అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారంపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఏకకాలంలో జిల్లాకేంద్రంతో పాటు పెద్దమందడి, వనపర్తి మండలాల్లోని పలు కేంద్రాలకు నాసిరకం కోడిగుడ్లు సరఫరా అయ్యాయి. ఈ విషయాన్ని కొన్ని రోజులుగా చిన్నారుల తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఏజెన్సీ నిర్వాహకులతో ఉన్న సత్సంబంధాల కారణంగా బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు కనీసం కేంద్రాలను సందర్శించి సదరు గుడ్లు సరఫరా చేసే ఏజెన్సీపై చర్యలు తీసుకోకపోవడంతో మీడియాను ఆశ్రయించటంతో పాటు సామాజిక మధ్యమం వేదికగా ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. నాసిరకం, పాడైపోయిన గుడ్లను కేంద్రాలకు సరఫరా చేయడమేంటనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. జిల్లాకేంద్రంలోని పాత పట్టణంలో ఉన్న పలు అంగన్‌వాడీల్లో గురువారం నల్లటి గుడ్లు ఉడకబెట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

జిల్లాలో 589 అంగన్‌వాడీలు..

జిల్లాలోని వనపర్తి ప్రాజెక్టులో 249, ఆత్మకూర్ ప్రాజెక్టులో 151, పెబ్బేరు ప్రాజెక్టులో 189 మొత్తం 589 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఒక్కరే గుడ్ల సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో ఉన్న అంగన్‌వాడీలకు గుడ్లు సరఫరా చేసే బాధ్యతను రాష్ట్ర స్థాయిలోనే టెండర్లు పిలిచి బాధ్యత అప్పగించటంతో పెద్దమొత్తంలో గుడ్లు సరఫరా చేయాల్సి ఉండటంతో ఇలాంటి నాసిరకం గుడ్లు వస్తున్నాయనే వదంతులున్నాయి.

ఫిర్యాదులు వచ్చాయి..

జిల్లాకేంద్రంతో పాటు మరికొన్ని కేంద్రాలకు నాసిరకం, నల్లని రంగుమారిన గుడ్లు సరఫరా అయినట్లు ఫిర్యాదులు వచ్చాయి. శుక్రవారం ఉదయం కేంద్రాలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకుంటాం. నాణమైన గుడ్లను సరఫరా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తాం. రంగుమారిన గుడ్లు చిన్నారులు ఎవరూ తినలేదు. గుడ్లను పరిశీలించి నాణ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే చిన్నారులకు ఇవ్వాలని ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు, సీడీపీఓలకు ఆదేశాలిచ్చాం.

– లక్ష్మయ్య, డీడబ్ల్యూఓ, వనపర్తి

ఏళ్లుగా ఒకే కాంట్రాక్టర్‌తో సరఫరా

జిల్లాతో పాటు సమీప జిల్లాల అంగన్‌వాడీ కేంద్రాలకు జిల్లాకేంద్రానికి చెందిన ఒకే కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకొని రెండేళ్లుగా గుడ్లు సరఫరా చేస్తున్నారు. ఆయనకు అధికారులతో ఉన్న సన్నిహిత సంబంధాలతో తాను ఎలాంటి గుడ్లు సరఫరా చేసినా.. అడిగేవారెవరు లేరన్న ధోరణిలో ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి.

కుటుంబాల గుర్తింపు పూర్తికావాలి



సమగ్ర సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తదితరులు

వనపర్తి: జిల్లావ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం వరకు ప్రతి ఇంటికి సర్వే స్టిక్కర్ అతికించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేపై గురువారం కలెక్టరేట్‌లో ప్రత్యేక అధికారులు, పుర కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాయంత్రం వరకు కుటుంబాల గుర్తింపు పూర్తిచేసి శనివారం నుంచి సర్వే ప్రారంభించాలన్నారు. సూపర్‌వైజర్లు ఇన్యుమరేషన్ బ్లాక్‌లను పరిశీలించి ఏవైనా మిగిలిన ఇళ్లు లేదా పొరపాట్లు ఉంటే ఎన్యుమరేటర్లకు సూచనలు చేయాలని సూచించారు. సర్వే ఫారాలను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకొని సర్వే చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. సర్వేపై గ్రామాల్లో టాంటాం చేయించాలని, 9వ తేదీ సాయంత్రం నుంచి సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉన్నందున అవసరమైన కంప్యూటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లను సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి సహకరించాలి..

ప్రజలు సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని కేడీఆర్‌నగర్‌లో పర్యటించి సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టిక్కర్లు, ఇళ్ల జాబితాలో నంబర్లు సరిగా రాయాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

షాపింగ్ మాల్స్‌కు పార్కింగ్ తప్పనిసరి..

జిల్లాకేంద్రంలోని షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ సౌకర్యం తప్పనిసరిగా ఉండాలని.. ఆ దిశగా పుర అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. అదేవిధంగా మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌లు తనిఖీ చేయాలని, లేనిపక్షంలో నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, పుర చైర్మన్ పుట్టపాకుల మహేశ్, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, ఎన్యుమరేటర్లు, సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆగని అవినీతి..!

ఏసీబీకి చిక్కుతున్నా మారని తీరు



ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో అవినీతి కంపు కొడుతోంది. పైకం లేనిదే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి ఉంది. ఓ వైపు లంచం తీసుకుంటూ పట్టుబడిన వారిని ఏసీబీ అధికారులు జైలుకు పంపిస్తున్నా.. ప్రభుత్వ ఉద్యోగుల తీరులో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. పనికింత ధర అనేలా తమ జోరును చాటుమాటుగా కానిచ్చేస్తున్నారు. ఇక్కడ అక్కడ అని లేకుండా శాఖోపశాఖల్లో అవినీతి ఊడలు విస్తరిస్తూనే ఉన్నాయి. – మహబూబ్‌నగర్ క్రైం

ప్రభుత్వ శాఖల్లో పెచ్చుమీరిన అక్రమాలు

- దాడుల్లో దొరుకుతున్నా.. కొనసాగుతున్న వసూళ్ల పర్వం
- తాజాగా ఏసీబీకి దొరికిన మహబూబ్‌నగర్ డీఈఓ
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన 14 మంది అధికారులు
- నిబంధనలకు తూట్లు పొడిచి, ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వైనం

14 కేసులు.. రెండు ఆకస్మిక తనిఖీలు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో వరుసగా అవినీతి కేసులు నమోదు కావడం ప్రభుత్వ శాఖల్లో కలకలం రేపుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 14 కేసులు నమోదు కాగా.. 21 మందిని కోర్టులో హాజరుపరిచారు. ఆర్టీఏ, బీసీ వెల్ఫేర్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అయితే ఇప్పటి వరకు నమోదైన కేసులను పరిశీలిస్తే.. అధికంగా రెవెన్యూ శాఖ ఉద్యోగులు పట్టుబడ్డారు. ఇక రాష్ట్రంలోనే ఉమ్మడి పాలమూరు అవినీతి కేసుల్లో అగ్రస్థానంలో ఉంది.

అక్రమార్కులపై నిఘా..

ముఖ్యమైన ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులపై ఏసీబీ నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. అయినప్పటికీ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించినా.. నిర్వహించకపోయినా పట్టించుకునే వారు ఎవరూ లేరనే ధీమా పలువురు అధికారుల్లో పెరిగిపోయినట్లు తెలుస్తోంది. రెవెన్యూ, విద్యుత్, పోలీసు, మున్సిపాలిటీ, రిజిస్ట్రేషన్, కమర్షియల్ ట్యాక్స్, చెక్‌పోస్టులు, రవాణా, లాండ్ అండ్‌సర్వే, మండల కేంద్రాల్లోని కార్యాలయాల్లో అవినీతి పెచ్చరిల్లినట్లు ఆరోపణలున్నాయి. రవాణా, కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌ల్లో పనిచేసే అధికారులు నేరుగా లంచాలు తీసుకోకుండా, ప్రైవేటు వ్యక్తులను ఏజెంట్లుగా పెట్టుకుని సాఫీగా పనులు సాగిస్తున్నారని తెలుస్తోంది.

మూడేళ్లుగా స్కూల్‌కు వెళ్లని డీఈఓ భార్య?

ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న డీఈఓ రవీందర్ భార్య మూడేళ్లకు పైగా విధులకు హాజరుకావడం లేదని సమాచారం. జిల్లా కేంద్రంలోని ఎర్రవల్లి తండాలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఆమె.. మూడేళ్ల నుంచి పాఠశాలకు వెళ్లకుండా ఇంటికే రిజిస్టర్స్ తెప్పించుకుని సంతకాలు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఆమె పాఠశాలకు వెళ్లకపోవడంతో బాలానగర్ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై అక్కడికి తీసుకువచ్చి పెట్టారు. అయితే మళ్లీ నెలరోజుల క్రితం నిబంధనలకు విరుద్ధంగా ఆమెను డిప్యూటేషన్‌పై శ్రీనివాస కాలనీ పాఠశాలకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అయితే డీఈఓ భార్య లోకల్ బాడీ కింద పని చేయాలి అంటే, గ్రామపంచాయతీ పరిధిలోని పాఠశాలలో పని చేయాలి. కానీ చేతిలో అధికారం ఉందని మున్సిపాలిటీ పరిధిలో తమ ఇంటి పక్కనున్న పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారు.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఏసీబీకి పట్టుబడిన అధికారులు

జనవరి 20: రమావత్ వశ్య (డిప్యూటీ ఇన్ స్పెక్టర్ ఆఫ్ సర్వే, కల్వకుర్తి)
జనవరి 22: రత్లవత్ బాలోజీ (ఎక్సైజ్ సీఐ, జడ్చర్ల)
జనవరి 29: జీవరత్నం (లైన్‌మేన్, అయిజ)
ఫిబ్రవరి 4: డి.సురేష్ (మహమ్మదాబాద్ ఎస్ఐ), ఇస్మాయిల్ (కానిస్టేబుల్), మహ్మద్‌మూసా (ప్రైవేట్ వ్యక్తి)
ఫిబ్రవరి 10 : ఎస్.పృథ్వీ (ఏఈ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ)
మార్చి 27 : నేనావత్ పాండునాయక్ (తహసీల్దార్, గుండుమాల్), రవీందర్‌రెడ్డి (ధరణి ఆపరేటర్), చిన్న మొగులప్ప (రికార్డు అసిస్టెంట్)
మే 31: ఎం.నరేందర్‌కుమార్(డీఈ), పి.వెంకటనాగేంద్రకుమార్ (ఎస్ఈ), బి.మధుకర్, ఏఏఈ) వనపర్తి విద్యుత్ శాఖ
జూన్ 12: వి.నరసింహస్వామి (అసిస్టెంట్ కమాండెంట్, పదో బెటాలియన్, బీచుపల్లి), కె.అబ్దుల్ వహెద్ (రిటైర్డ్ ఏఆర్ఎస్ఐ)
జూన్ 25: ఎం.రవి (ఎస్ఐ, వెల్దండ), జి.విక్రం (102 అంబులెన్స్ డ్రైవర్)
జులై 3: శివ శ్రీనివాసులు (గోపాల్‌పేట, తహసీల్దార్)
జులై 25: బాలరాజు (ఐకేపీ సర్వేయర్, మక్తల్ తహసీల్దార్ కార్యాలయం)
సెప్టెంబర్ 3: డి.వెంకటేశ్వర్‌రావు (ఏసీటీఓ, మహబూబ్‌నగర్)
అక్టోబర్ 22: కె.ఆదిశేషు (మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2, పెబ్బేర్)
నవంబర్ 7: రవీందర్ (డీఈఓ, మహబూబ్‌నగర్)



మహబూబ్‌నగర్ శ్రీనివాసకాలనీలో డీఈఓ రవీందర్ నివాసం

ఆ సార్ రూటే సప‘రేటు’..

తాజాగా ఏసీబీకి పట్టుబడిన డీఈఓ రవీందర్ ఏ జిల్లాలో పనిచేసినా.. ఆయన రూటే సప‘రేటు’ అనే విధంగా వ్యవహార శైలి మార్చుకున్నాడు. జోగుళాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో పనిచేసిన సమయంలో డీఈఓ రవీందర్ అవినీతి వ్యవహారాలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చాయి. మూడేళ్ల క్రితం మహబూబ్‌నగర్ డీఈఓగా వచ్చారు. జిల్లాస్థాయి అధికారిగా పనిచేస్తూ రూ.లక్షలు గడించినట్లు ఆరోపణలున్నాయి. కాగా.. డీఈఓ రవీందర్ లంచం రూపంలో ఉపాధ్యాయుల నుంచి తీసుకున్న డబ్బులకు సంబంధించి కొందరు ఫోన్ పే, గూగుల్ పేకు సంబంధించిన స్క్రీన్ షాట్స్‌ను ఏసీబీ అధికారులకు అప్పగించినట్లు సమాచారం. ఎవరి వద్ద ఎంత స్థాయిలో డబ్బు వసూలు చేశాడనే విషయంపై ఏసీబీ బృందం కూపీ లాగుతుంది.

విచారణ కొనసాగుతుంది..: ఏసీబీ డీఎస్పీ

లంచం తీసుకుంటూ పట్టుబడిన డీఈఓ రవీందర్ ఇంట్లో విలువైన వస్తువులేవీ పట్టుబడలేదని.. స్వగ్రామమైన దామరగిద్దలో మాత్రం ప్లాట్లు గుర్తించామని ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు. బినామీ పేర్లపై ఆస్తులు ఉన్నాయనే అనుమానం ఉందని.. ఈ మేరకు డీఈఓ ఫోన్‌కాల్స్, ఇతర డాక్యుమెంట్స్ పరిశీలన చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర బంధువులు, కుటుంబసభ్యుల ఇళ్లలో సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. డీఈఓకు సంబంధించిన అన్ని రకాల ఆస్తులు ఎక్కడ ఉన్నాయనే విషయంపై సమగ్ర విచారణ కొనసాగిస్తున్నామన్నారు. గతేడాది కాలం నుంచి అతడిపై ఫిర్యాదులు వచ్చాయని.. సరైన ఆధారాల కోసం ఎదురుచూడాల్సి వచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే డయల్ 1064 నంబర్‌తో పాటు ఏసీబీ అధికారులను సైతం నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా ప్రజలు చాలా వరకు చైతన్యవంతం కావడంతోనే కేసుల సంఖ్య పెరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు చేస్తామని.. బాధితులను ఏ అధికారి డబ్బులు అడిగినా సమాచారం ఇవ్వాలని కోరారు.

హనుమద్ వాహనంపై కురుమతిరాయుడు





అమ్మాపురం కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి, పద్మావతి అమ్మవార్లు హనుమద్ వాహనంపై ఊరేగారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హనుమద్ వాహన సేవ నిర్వహించారు. ఆలయం నుంచి కళ్యాణకట్ట వరకు ఊరేగించి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనగా.. కురుమూర్తి గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

– చిన్నచింతకుంట

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం



లబ్ధిదారుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న డా. చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: పేద రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసా కల్పిస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తన నివాసంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రజలు ఎలాంటి సిఫారస్‌లు లేకుండా నేరుగా వచ్చి కలవొచ్చని.. అర్హులైన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘం చైర్మన్ యాదయ్య, డీసీసీ కార్యదర్శి రాగి వేణు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ బకాయిలు అప్పగించాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పాన్‌గల్: రైస్‌మిల్లర్లు పెండింగ్ సీఎంఆర్ నెలాఖరు నాటికి ఎఫ్‌సీఐకి అప్పగించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండలంలోని గోప్లాపూర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి రైస్‌మిల్లును ఆయన తనిఖీ చేసి బియ్యాన్ని పరిశీలించారు. మండలంలో సీఎంఆర్ అందించే రైస్‌మిల్లులను తనిఖీ చేస్తూ సకాలంలో ఎఫ్‌సీఐకి చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవిందరావు, ఎంపీఓ రఘురాములు, డీటీ అశోక్‌నాయుడు, ఆర్ఐ మహేశ్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా వివరాల నమోదు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాల నమోదును పారదర్శకంగా చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండల కేంద్రంలో సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివరాల నమోదులో సొంత అభిప్రాయాలు, నిర్ణయాలు వద్దని, ఇంటి యజమాని చెప్పిన వాటిని మాత్రమే నమోదు చేయాలని సూచించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని, మండలస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.



పాన్‌గల్‌లో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి..

మండలంలో వరి కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి రైతుల ఇబ్బందులు తొలగించాలని మండలస్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. ఐకేపీ, సహకార సంఘాల అధికారులతో సమావేశాలు నిర్వహించి కేంద్రాలు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పారదర్శక సేవలు అందించాలి

ఎస్పీ రావుల గిరిధర్

ఖిల్లాఘనపురం: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రతి ఒక్కరికి సిబ్బంది పారదర్శకంగా సేవలు అందించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు, ఠాణా పరిసరాలు, రిసెప్షన్, లాకప్, మెన్ బరాక్, టెక్నికల్ రూంను పరిశీలించారు. ఏయే గ్రామాల్లో ఎలాంటి నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు తదితర వివరాలను ఎస్ఐ సురేశ్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. పోలీసులు చట్టాలను పాటించడంతో పాటు ఇతరులు అనుసరించేలా చూడాలని కోరారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే విచారించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ వాహన తనిఖీలు చేపడుతూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి ప్రమాదాలు నివారించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కఠినంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు.



ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

రోడ్లను కల్లాలుగా మార్చొద్దు : ఎస్పీ

వనపర్తి: రైతులు ధాన్యాన్ని రహదారులపై పోసి వాహనదారులకు ఇబ్బందులు కలిగించొద్దని ఎస్పీ రావుల గిరిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లపై ధాన్యం పోసి నల్లటి టార్పాలిన్లు కప్పడంతో రాత్రివేళల్లో కనిపించక వాహనదారులు ఢీకొట్టి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. పొలాలు, ఇళ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాల్లో ధాన్యం ఆరబెట్టుకునేందుకు ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


శేషమ్మ మృతదేహం

గద్వాల క్రైం: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ఎర్రవల్లి మండలం బట్లదిన్నెకు చెందిన సుంకన్న కూతురు శేషమ్మ (31), గద్వాల మండలం గోనుపాడుకు చెందిన రామకృష్ణకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వివాహమైనప్పటి నుంచి భార్య శేషమ్మపై రామకృష్ణ అనుమానం పెంచుకున్నాడు. సొంత బంధువులతో మాట్లాడినా విచక్షణ రహితంగా కొట్టడంతో పాటు తన సోదరుడు పెద్దరాముడితో కలిసి వేధింపులకు గురిచేసేవాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరు గురువారం బైక్‌పై స్వగ్రామం నుంచి జిల్లా కేంద్రానికి బయల్దేరారు. గద్వాల ఔటర్ రింగ్‌రోడ్డుపై కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి కింద పడటంతో తన భార్య శేషమ్మ అక్కడికక్కడే మృతిచెందినట్లు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని ప్రైవేటు కారులో జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అయితే ప్రమాదంలో బైక్‌కు ఎలాంటి డ్యామేజీ కాకపోవడం, రామకృష్ణకు సైతం ఎటువంటి గాయాలు లేకపోవడంతో శేషమ్మ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తంచేశారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


విస్లావత్ సంతోష్ (ఫైల్)

హన్వాద: మండలంలోని చిన్నదర్పల్లి శివారు పూజారితండా వద్ద కోయిల్‌కొండ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని అడవివెంకటాపూర్ ఆమ్లేట్ గ్రామమైన మాచన్‌పల్లితండాకు చెందిన విస్లావత్ సంతోష్ (21) ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి బుధవారం రాత్రి 11గంటల ప్రాంతంలో జిల్లాకేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జిల్లా కేంద్రం నుంచి కోయిల్‌కొండ వైపు వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన విస్లావత్ సంతోష్‌ను కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీంతో ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ నెంబర్ ప్లేట్‌ను తొలగించి డ్రైవర్ యాదయ్య పరారయ్యాడు. ట్రాక్టర్ కోయిల్‌కొండ మండలంలోని దమాయపల్లికి చెందినదిగా స్థానికులు గుర్తించి హన్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన వృద్ధుడి(70) మృతదేహం పోలీసులకు లభ్యమైంది. గురువారం ఉదయం దారిన పోయే ప్రయాణికులు వృద్ధుడికి కొంత ఆహారం అందించారని, అనారోగ్యం వల్ల చనిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. వృద్ధుడు ప్రమాదానికి గురి కాలేదని ఏఎస్‌ఐ శ్రీనివాసులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించామని, వృద్ధుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు.

బావిలో దూకిన యువకుడు గల్లంతు

హన్వాడ: చేసిన అప్పులు తీర్చలేక.. కట్టుకున్న భార్య ఆదరణ లేక ఓ వ్యక్తి తీవ్ర మనస్థాపానికి గురై బావిలో దూకిన ఘటన హన్వాడ మండలం టంకర గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. టంకరకు చెందిన మంగళి ఆంజనేయులు (30) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగించే వాడు. ఇటీవల అయ్యప్ప దీక్ష చేపట్టాడు. కొంతకాలంగా అతడికి అప్పులు ఎక్కువ కావడం.. కట్టుకున్న భార్య గొడవపడి తల్లిగారి ఊరైన నారాయణపేట జిల్లా ఊట్కూర్‌కు వెళ్లిపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో అయ్యప్ప దీక్షలోనే మద్యం తాగి, గ్రామ శివారులోని బావిలో దూకాడు. గమనించిన ఓ బాలుడు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో బావిలో గాలింపు చర్యలు చేపట్టగా.. అతడి ఆచూకీ లభించలేదు. ఈ విషయంపై ఎస్‌ఐ వెంకటేష్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉద్దాల ఉత్సవానికి వేళాయె..


చిన్నవడ్డెమాన్‌లో ఉద్దాలు తయారు చేస్తున్న దళితులు

నేడు నిర్వహణకు ఏర్పాట్లు చేసిన అధికారులు

- భారీగా తరలిరానున్న భక్తులు
- జనసంద్రంగా మారనున్న దారులు

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాల కార్యక్రమం శుక్రవారం జరగనుంది. ఈ వేడుకకు లక్షలాది మంది భక్తులు తరలిరానుండగా.. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉద్దాల మండపం, జాతర మైదానంలో బారికేడ్లు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. ముందుగా పల్లమర్రిలో ప్రత్యేకంగా తయారు చేసిన చాటను గ్రామస్తులు ట్రాక్టర్‌పై ఊరేగింపుగా చిన్నవడ్డెమాన్‌లోని ఉద్దాల మండపానికి తీసుకొస్తారు. అక్కడ ఉద్దాలకు మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాటిని చాటలో ఉంచి ఊరేగింపుగా పోలీసు భద్రత నడుమ అప్పంపల్లి ఊకచెట్టువాగు, వ్యవసాయ పొలాల మీదుగా తిర్మలాపూర్ ఆంజనేయ స్వామి ఆలయానికి తీసుకొస్తారు. అక్కడ సమీప గ్రామాల భక్తులు ఉద్దాలను దర్శించుకొని పూజలు చేస్తారు. అనంతరం ట్రాక్టర్‌పై ఉంచి అక్కడి నుంచి కురుమతి కొండలకు తరలిస్తారు. దీంతో చిన్నవడ్డెమాన్, ఊకచెట్టువాగు, అప్పంపల్లి, తిర్మలాపూర్‌తో పాటు కురుమూర్తి ఆలయం వరకు రహదారులన్నీ జనసంద్రంగా మారనున్నాయి. స్వామివారి ఉద్దాలను తాకి పునీతులయ్యేందుకు భక్తులు పోటీ పడతారు.

ఆనందంగా ఉంది..



మా తాతల కాలం నుంచి కురుమూర్తిస్వామి ఉద్దాల మండపంలో పూజారులుగా ఉన్నాం. స్వామివారి ఉద్దాలు తయారు చేయడంలో ఏళ్లుగా మా వంశస్తులు పాలు పంచుకుంటున్నాం. ఇందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది ఆ భగవంతుడు మాకిచ్చిన వరంగా భావిస్తున్నాం.

– మ్యాతరి చంద్రయ్య, ఉద్దాల తయారీదారుడు

అదృష్టంగా భావిస్తున్నాం..



స్వామివారి ఉద్దాల తయారీలో భాగస్వాములవడం మా అదృష్టంగా భావిస్తున్నాం. స్వామివారి కృప మా కుటుంబాలపై ఉంటుంది. కాని ఏటా ఉద్దాలు తయారుచేసే ఏడురోజులు మాత్రం మమ్మల్ని గుర్తిస్తారు.. అనంతరం ఎవరూ పట్టించుకోరు. ప్రభుత్వం, ఆలయ అధికారులు మమ్మల్ని గుర్తించి స్వామివారి సన్నిధిలో ఎప్పటికీ సేవచేసే అవకాశం కల్పించాలి.

– పురుషోత్తం, ఉద్దాల తయారీదారుడు

నియమ నిష్టలతో..


ఉద్దాలు ఉంచే చాట

ఉద్దాల తయారీలో చిన్నవడ్డెమాన్‌లోని 60 దళిత కుటుంబాలకు చెందిన 40 మంది యువకులు, వృద్ధులు పాల్గొంటారు. కార్తీక అమావాస్య నుంచి ఏడురోజుల పాటు మద్యం, మాంసం వీడి ఒంటిపూట భోజనం చేస్తూ నిష్ఠతో కురుమూర్తిస్వామి, పద్మావతి అమ్మవార్ల పాదుకలు తయారు చేస్తారు. పాదుకలకు ఆవు చర్మం, వన్నెలాకు తగురము, పచ్చపూసలు, టేస్‌పోగులు, తగ్గి, మైనం, రేషం, పట్టు తదితర వాటితో తయారు చేస్తారు. వీటిని సప్తమి రోజున ఊరేగింపుగా కురుమూర్తి గిరులకు చేరుస్తారు.

ఇదీ చరిత్ర..


సిద్ధమైన ఉద్దాలు

సుమారు 12 వందల ఏళ్ల కిందట స్వామివారు ఆలయ చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలతో కలిసి రాత్రివేళల్లో కోలాటం వేసి కనిపించకుండా వెళ్లే వారని.. చిన్నవడ్డెమాన్‌లో కోలాటం వేసి వెళ్తుండగా కాలికి గాయమైందని ప్రతీతి. అనంతరం స్వామివారు గ్రామ దళితుల దగ్గరకు వెళ్లి పాదుకలు తయారు చేసి ఇవ్వాలని కోరారని.. తాను కురుమూర్తి గుట్టల్లో వెలిసిన కురుమూర్తిస్వామిగా చెప్పారని చరిత్ర చెబుతుంది. ప్రతి ఏటా తనకు పాదుకలు తయారు చేసి గుట్టకు తీసుకురావాలని, కార్తీక అమావాస్య రోజున ఓ చోట ఇసుక పోసి ఉంచితే అర్ధ రాత్రి వేళ పాదుకల అచ్చులు వేసి వెళ్తానని చెప్పారని ప్రతీతి. వాటి ఆధారంగా పాదుకలు తయారుచేసి సప్తమి రోజున కురుమూర్తి గుట్టకు ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోందని పెద్దలు చెబుతున్నారు. నాటి నుంచి ప్రతి ఏటా కార్తీక అమావాస్య రోజున దళితులు ఊకచెట్టువాగు ఇసుకను తీసుకొచ్చి ఉద్దాల మండపంలో పోసి స్వామివారు పాదాల అచ్చులు వేయాలని పూజలు చేయడం, స్వామివారికి పాదుకలు తయారుచేసి కురుమూర్తి గుట్టకు తీసుకెళ్లడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

‘తప్పుడు కేసులు బనాయించడం సరికాదు’


శ్రీకాంత్‌గౌడ్‌ను పరామర్శించి బయటకు వస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

జిల్లాసెంటర్ (మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టలేరని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా జైలులో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీకాంత్‌గౌడ్‌ను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్ల పట్టాల విషయంలో తప్పుడు పత్రాలు సృష్టించారనే కారణంతో శ్రీకాంత్‌గౌడ్‌ను రిమాండ్ చేయడం సరికాదని, తహసీల్దార్ రిపోర్ట్‌లో ఆ విషయం ఉందా అని ప్రశ్నించారు. గిట్టనివారు చేసే ఆరోపణలతో ఆయనపై కేసు నమోదు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబంపై వేధింపులు ఆపేయాలని కోరారు. అంధుల వద్ద డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి లేదనే విషయం ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే కక్షపూరిత రాజకీయాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పినట్టు పోలీస్ అధికారులు పనిచేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే చట్ట వ్యతిరేకంగా పనిచేసే అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శ్రీనివాస్‌గౌడ్ రూ.వేల కోట్ల నిధులు తీసుకొచ్చి మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేశారని, ప్రస్తుత ఎమ్మెల్యేకు అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలన అంటే ప్రతిపక్షాలను వేధించడం అనేలా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ చైర్మన్ యాదయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ తదితరులు శ్రీకాంత్‌గౌడ్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

రూ.3.60 లక్షల నగదు చోరీ


చోరీ జరిగిన కారును పరిశీలిస్తున్న ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్

గద్వాల క్రైం: హోటల్ దగ్గర కారు నిలిపి భోజనం చేసేందుకు వెళ్లిన క్రమంలో గుర్తు తెలియని దుండగులు కారు అద్దం ధ్వంసం చేసి కారులో ఉన్న రూ.3.60 లక్షల నగదును చోరీ చేసి సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. అలంపూర్ మండలం ఇమ్మాంపూర్ గ్రామానికి చెందిన జితేందర్ తండ్రి సిద్దప్పలు గద్వాల పట్టణంలోని వారి సొంత ప్లాటును వినోద్‌కు విక్రయించేందుకు ఉదయం వచ్చారు. ఈ క్రమంలో ప్లాటు కొనుగోలు చేసిన క్రమంలో సదరు వ్యక్తి రూ. 3.60లక్షల నగదు విక్రయదారులకు అందజేశారు. అనంతరం నగదు కారులో స్వగ్రామానికి బయలు దేరారు. భోజనం చేసేందుకు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న భాగ్యలక్ష్మీ హోటల్ ఎదుట కారు నిలిపి తండ్రి, కొడుకులు వెళ్లారు. కారులో నగదును గుర్తించిన దుండగులు అద్దం ధ్వంసం చేసి అపహరించారు. అనంతరం కారు వద్దకు వచ్చి చూడగా అద్దం ధ్వంసమై, నగదు బ్యాగు లేకపోవడంతో దుండగులు చోరీ చేసినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని పలు విషయాలపై ఆరా తీశారు. సీసీ కెమెరాలలో రికార్డు అయిన పుటేజీలను పరిశీలించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు వచ్చినట్లు గుర్తిస్తే నిర్వాహకులు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బాధితుల ఆరోపణ
- జిల్లా కేంద్రానికి రెఫర్ చేసిన సిబ్బంది
- ఇంజక్షన్లు, రక్త పరీక్షలు బయటికే..
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


దీపికకు పుట్టిన బిడ్డతో కుటుంబ సభ్యులు

మక్తల్: నిరుపేద కుటుంబాలకు చెందిన గర్భిణులు కాన్పు కోసం వస్తే వైద్యుల నిర్లక్ష్యం వల్ల బాలింత మృతి చెంది, పుట్టిన బిడ్డ క్షేమంగా ఉన్న సంఘటన గురువారం మక్తల్ ప్రభుత్వాసుపత్రిలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని గడ్డంపల్లికి చెందిన దీపిక(26)కు కర్ణాటకకు చెందిన శివతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ఇద్దరు సంతానం. మూడో కాన్పు కోసం రెండు రోజుల క్రితం మక్తల్ ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. బుధవారం 11గంటలకు సాధారణ కాన్పు అయింది. కాన్పు అయిన కొద్దిసేపటికే తీవ్ర రక్తస్రావం కావడంతో నారాయణపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాత్రి 2గంటల సమయంలో డాక్టర్లు పరీక్ష చేసేలోపే ఆమె మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని మార్చురీలో ఏర్పాటు చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే దీపిక చనిపోయిందని బంధువులు ఆస్పత్రికి చేరుకొని ఆందోళన చేపట్టారు. బాలింత మృతి విషయం తెలియగానే మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ఆస్పత్రికి చేరుకున్నారు. దీపిక మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు. దీపిక మృతదేహాన్ని సొంతత గ్రామం కర్ణాటకలోని సజ్జనపూర్‌కు తీసుకెళ్లారు. బాలింత మృతిపై పూర్తి స్థాయిల్లో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డాక్టర్ రంజిత్ కుమార్ విలేకర్లకు తెలిపారు. ఈ సంఘటనపై మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డిని వివరణ కోరగా, తమకు ఫిర్యాదు చేయ లేదని తెలిపారు.


దీపిక (ఫైల్)

జాతరకు భారీ బందోబస్తు



రాజగోపురం వద్ద మొహరించిన పోలీసులు, రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలు, జాతరను తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు కురుమూర్తి గుట్టకు తరలివస్తారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతర మైదానంలో 120 మరుగుదొడ్లతో పాటు తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేశారు. 250 మంది పారిశుద్ధ్య కార్మికులు, 8 చెత్త ట్రాక్టర్లను అందుబాటులో ఉంచారు. 18 ట్యాంకుల ద్వారా తాగునీటిని అందించనున్నారు. 4 వైద్య శిబిరాలు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు 2 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచి భక్తులకు వైద్య సేవలు అందించనున్నారు.

భారీ భద్రత

జాతరలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. జాతర మైదానంలో రాజగోపురం వద్ద, ఉద్దల గుండు సమీపంలో భారికేడ్లు పెట్టారు. 100 సీసీ కెమెరాలు బిగించడంతో పాటు 600 మంది పోలీస్ సిబ్బందిని నియమించారు. ముగ్గురు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 42 మంది ఎస్‌ఐలు, 100 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 239 పోలీస్ సిబ్బంది, 79 మహిళా పోలీసులు, 121 హోం గార్డులు శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతరలో దొంగల బెడద ఉంటుందని, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

తరలివచ్చిన తూర్పు కోడెలు

కురుమూర్తి స్వామి జాతరలో తూర్పు కోడెల విక్రయాలకు మంచి ప్రాధాన్యత ఉంటుంది. జాతరలో తూర్పు కోడెలు విక్రయించేందుకు అచ్చంపేట, కొల్లాపూర్, శ్రీశైలం ప్రాంతాల నుంచి రైతులు ప్రతి ఏటా జాతరకు తరలిస్తారు. ఇప్పటికే తూర్పుకోడెలు జాతరకు చేరుకున్నాయి.

వైభవంగా తలియకుండ ఉత్సవం


అప్పంపల్లిలో తలియకుండ ఊరేగింపు

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో గురువారం తలియకుండ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కురుమూర్తిస్వామి ఉద్దాలోత్సవానికి ముందు రోజు గ్రామంలో తలియకుండ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా నెల్లి వంశస్తులు తమ ఇంటి నుంచి పూలమాలను తలియకుండ మండపానికి తీసుకువచ్చారు. అక్కడ శాలివాహనులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చిన్నవడ్డేమాన్‌లోని ఉద్దాల మండపానికి తరలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మనోహర్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో చాంపియన్లుగా నిలవాలి


ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్లతో ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి

మహబూబ్‌నగర్ క్రీడలు: సిద్దిపేటలో శుక్రవారం నుంచి ఈనెల 10 వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 విభాగం రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు గురువారం తరలివెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో క్రీడాజట్లను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అభినందించారు. రాష్ట్రస్థాయి టోర్నీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్లుగా నిలవాలని ఆకాంక్షించారు.

కొంపల్లిలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

హైదరాబాద్‌లోని కొంపల్లిలో నేటి నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు తరలివెళ్లారు. జిల్లా జట్లను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి అభినందించారు.

రెండోరోజు పోలేపల్లిలో దాడులు


పోలేపల్లిలో కరెంట్ కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

జడ్చర్ల టౌన్: లోకాయుక్త ఆదేశాలతో మండలంలోని పోలేపల్లి గ్రామంలో వరసగా రెండోరోజు గురువారం అనుమతిలేని, వ్యవసాయ బోర్లతో వ్యాపారం చేస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. విద్యుత్ సిబ్బందితో కలిసి వారు గ్రామంలో పర్యటించారు. వ్యవసాయ బోర్ల పేరుతో వ్యాపారం చేస్తున్న వారిబోర్లకు సంబంధించిన కరెంట్ కనెక్షన్లు తొలగించారు. కొందరు స్వచ్ఛందంగా కనెక్షన్లు తొలగించుకుంటామని అధికారులను కోరగా, ఇదేరోజు తొలగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కంపెనీలకు నేరుగా పైప్‌లైన్ ద్వారా నీటిని పంపింగ్ చేస్తుండడంతో కొద్ది మేర తొలగించారు. భవిష్యత్‌లో మళ్లీ పొరపాటు చేయరాదని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ హెచ్చరించారు.

పత్తి తరలిస్తున్న డీసీఎంకు మంటలు



కల్వకుర్తి రూరల్: మండలంలోని వేపూరు వద్ద గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు పత్తి తరలిస్తున్న డీసీఎంలో మంటలు చెలరేగి సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. ప్రత్యక్షుల కథనం మేరకు.. తాడూరు మండలం సిర్సవాడ తదితర గ్రామాల్లోని రైతుల వద్ద సేకరించిన పత్తిని డీసీఎంలో నింపుకొని తుర్కలపల్లి గేట్ వద్ద ఉన్న సీసీఐ కేంద్రానికి తరలిస్తున్నారు. మార్గమధ్యంలో వాహనం ఇంజన్‌పై పత్తి పడి నిప్పు రాజుకొని మెల్లగా మంటలు చెలరేగాయి. గుర్తించిన వేపూరు గ్రామస్తులు డ్రైవర్‌ను హెచ్చరించడంతో శ్మశానవాటిక వద్ద వాహనం నిలిపివేసి రైతుల సహకారంతో నీటిని చల్లి మంటలు ఆర్పారు. 40 క్వింటాళ్ల పత్తి వాహనంలో ఉండగా.. 20 క్వింటాళ్ల వరకు దగ్ధం కావడంతో పాటు డీసీఎం కాలిపోయింది.

పాత సామగ్రి షెడ్డు దగ్ధం

- టీవీ మెకానిక్ దుకాణానికి వ్యాపించిన మంటలు


దేవరకద్రలో పాత సామగ్రి షెడ్డులో ఎగిసి పడుతున్న మంటలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం సమీపంలో పాత సామగ్రి షెడ్డుకు గురువారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. షెడ్డులో పాత సమన్లతో పాటు ప్లాస్టిక్ సీసాలకు అంటుకొని అదుపు చేయలేక పోవడంతో పక్కనే ఉన్న టీవీ మెకానిక్ షాపునకు మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న మరిన్ని షాపులకు, నివాసాలకు మంటలు వ్యాపించకుండా స్థానికులు నీళ్లు చల్లి అదుపు చేశారు. టీవీ మెకానిక్ షాపులోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయి. దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని పాత సమాన్ల యజమాని అలీమ్ తెలిపారు. రూ.లక్ష వరకు నష్టం జరిగిందని టీవీ మెకానిక్ షాపు యజమానికి మజార్ తెలిపారు. సంఘటనా స్థలానికి వచ్చిన ఆర్‌ఐ శరత్ దగ్ధమైన షాపులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రాజెక్టులకు స్వల్ప వరద

ధరూరు/దోమలపెంట/మదనాపురం/రాజోళి: ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు స్వల్పంగా వరద కొనసాగుతుంది. గురువారం సాయంత్రం జూరాలకు 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి కొనసాగించారు. ఇందు కోసం 5,126 క్యూసెక్కుల నీటిని వినియోగించుకున్నారు. ఎత్తిపోతల పథకాలకు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 7,058 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.521 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ సుంకేసుల డ్యాంకు 6,910 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా.. ఒక గేటు ఎత్తి 4,446 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర పేర్కొన్నారు.

■ శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 878.9 అడుగుల వద్ద 182.6050 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 9,557 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ఎడమ గట్టు భూగర్భకేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 29,043 మొత్తం 64,356 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

■ మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1150 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.